క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

కుంటాల: కుంటాల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో గురువారం మరమ్మతులు చేపడుతున్నట్లు డిస్కం ఏఈ మధు ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకూర్, దౌనెల్లి, రాజాపూర్ గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామంలో ఏనుగు బాజరెడ్డి అనే రైతుకు చెందిన ఎద్దు ప్రమాదవశాత్తు బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. వ్యవసాయ పనులు నిర్వహించి మధ్యాహ్న భోజన సమయంలో మేత కోసం ఎడ్లను పొలం గట్టుపై వదిలాడు. మేత మేస్తూ ఎద్దు వెళ్లి విద్యుత్ సరఫరా అవుతున్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.75వేల వరకు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు. పశువైద్యురాలు ప్రియాంక వచ్చి పంచనామా నిర్వహించగా విద్యుత్ లైన్‌మెన్ గంగాధర్ ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు.

కడెం ఎస్సైగా సాయికిరణ్



కడెం: కడెం ఎస్సైగా పి.సాయికిరణ్ బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వర్తించిన కృష్ణసాగర్ రెడ్డి జగిత్యాల జిల్లా గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా.. ఆయన స్థానంలో నర్సాపూర్(జి) ఎస్సై సాయికిరణ్ బదిలీపై కడెం వచ్చారు.

ఇళ్ల కోసం ఆందోళన

ఖానాపూర్: తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మండలంలోని పాతఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని ఒడ్డెవాడలో గ్రామస్తులు బుధవారం ఆందోళన చేశారు. గ్రామంలో అధికారులు అనర్హులకు ఇళ్లు కేటాయించి అర్హులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకు ఇళ్లు ఇవ్వకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అంబేడ్కర్ యూత్ కార్యవర్గం

ముధోల్: మండలకేంద్రంలో బుధవారం అంబేడ్కర్ యూత్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంగ్వే అనిల్, ఉపాధ్యక్షులుగా సోన్‌కాంబ్లే రాజ్‌కుమార్, బి.రాజు, ప్రమోద్, సెక్రటరీగా రోహిత్, జాయింట్ సెక్రటరీగా అమూల్, క్యాషియర్‌గా శివతోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కొత్త కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

రంగు మారిన తాగునీరు



బాటిల్‌లో రంగు మారిన నీరు

నిర్మల్‌టౌన్: పట్టణంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో తాగునీటి సరఫరాలో లోపాలు తలెత్తుతున్నాయి. ఏ నీరు సురక్షితమో.. కాదో పరీక్షించి చూస్తే తప్ప గుర్తించలేని పరిస్థితి నెలకొంది. బాలాజీవాడ కాలనీలోని ఇళ్లకు ఖిల్లా గుట్ట నుంచి మున్సిపల్ నీరు సరఫరా అవుతోంది. ఈ కాలనీలో కొద్దిరోజులుగా తాగునీరు రంగు మారి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే చేరాలి

కుంటాల: ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అన్ని సౌకర్యాలున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని బుధవారం కుంటాలలో అధ్యాపకులు ప్రచారం చేశారు. ఈసందర్భంగా విద్యార్థులతో ర్యాలీ తీస్తూ కళాశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, కోర్సులు, తదితర వివరాలను పోషకులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం

ఖానాపూర్: పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడిగా బి.నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా ఎం.దేవిదాస్, కోశాధికారిగా బి.పోశెట్టి, ఉపాధ్యక్షులుగా బి.భీమేశ్, బి.రాజశేఖర్, వామన్, సహాయ కార్యదర్శిగా నర్సింహాచారి, కార్యవర్గ సభ్యులుగా భీమన్న, రమేశ్, రవి, రాజశేఖర్, శ్రీనివాస్ ఎన్నికయ్యారని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

చెత్తను రోడ్డుపై పడేయొద్దు

నిర్మల్‌టౌన్: చెత్తను రోడ్డుపై పడేయకుండా మున్సిపాలిటీ చెత్త వాహనాల్లోనే వేయాలని సిబ్బంది దుకాణదారులను కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ ఆదేశాల మేరకు నిర్మల్‌లోని దుకాణాల యజమానులకు చెత్తను బయట పడేయొద్దని అవగాహన కల్పించారు. బయట పడేసిన చెత్తను తిని మూగజీవాల ప్రాణాలకు హాని కల్గుతుందన్నారు. దోమలు సైతం వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడతారని పేర్కొన్నారు. ఇందులో పలువురు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఒంటికీ.. రెంటికీ కష్టాలే

- తానూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కరువైన నీరు
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, అధ్యాపకులు



నీళ్లు రాని నల్లాలు



నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మరుగుదొడ్లు

తానూరు: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేకపోవడంతో ఒంటికి, రెంటికీ వెళ్లేందుకు విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థినులు, మహిళా అధ్యాపకుల కష్టాలు వర్ణనాతీతం. ప్రస్తుతం కళాశాలలో మొత్తం 150 మంది విద్యార్థులు, 10 మంది అధ్యాపకులు ఉన్నారు. కళాశాలలో నీటి వసతి లేక మరుగుదొడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. తాగునీటిని సైతం ఇంటి నుంచి బాటిళ్లలో తెచ్చుకుంటున్నారు. దీంతో విద్యార్థుల హాజరుశాతం తగ్గుతోంది. మరుగుదొడ్లకు నీటి వసతి కల్పించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్



తానూరులో లబ్ధిదారుకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్, పక్కన నాయకులు

తానూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ సూచించారు. బుధవారం మండలకేంద్రంలోని రైతువేదికలో 39 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావ్ పటేల్, తహసీల్దార్ లింగంమూర్తి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కుంటాల: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. బుధవారం కుంటాల రైతువేదికలో 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. యాసంగిలో అమ్మిన జొన్నల డబ్బులను రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. 11ఏళ్ల బీజేపీ పాలనలో భారత్ పెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, తహసీల్దార్ కమల్‌సింగ్, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, డీటీ నరేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ గజ్జారాం, రమణారావు, వెంగల్‌రావు, పసుల నవీన్, జక్కుల గజేందర్, శేఖర్‌రావు, గోవర్ధన్, మునీశ్వర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఉన్నత భవిష్యత్



సెల్ఫీ పాయింట్ వద్ద విద్యార్థులతో నిర్మల్ పోలీసులు



సోన్ : అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: విద్యార్థులు, యువత గంజాయి వివిధ రకాల డ్రగ్స్‌కు దూరం ఉంటే ఉన్నత భవిష్యత్ సొంతమవుతుందని నిర్మల్‌రూరల్ సీఐ కృష్ణ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని మంజులాపూర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డ్రగ్స్ వాడకంపై అవగాహన కల్పించారు. సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేసి ఫొటోలు దిగారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా, సరఫరా చేసినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూరల్ ఎస్సై లింబాద్రి, ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సోన్: మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పోలీసులు మత్తు పదార్థాలు వినియోగిస్తే కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ జనార్దన్, హెచ్‌ఎం విద్యాసాగర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే పోలీసులకు చెప్పాలన్నారు. అనంతరం చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. పోలీసులు జాదవ్ మోహన్, వెంకటరమణ, కీర్తన, రాజు, ఉపాధ్యాయులు సాయరెడ్డి, లక్ష్మన్, భిక్షపతి నాయక్, లింగారెడ్డి, రాజమహేందర్, ముత్తన్న, రమేశ్, దత్తురాం, సౌజన్య, ప్రభ పాల్గొన్నారు.

యువత క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ఖానాపూర్: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ పెంచుకోవాలని ఖానాపూర్ సీఐ అజయ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ నిర్మూలన వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు, సెల్‌ఫోన్, ఆన్‌లైన్ ఆటలకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు బానిసైతే మానసిక రుగ్మతలు, అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు ఉన్నారు.

కూతురి జ్ఞాపకార్థం పేదలకు చేయూత

- 11 మంది నిరుపేదలకు సుమారు రూ.రెండు లక్షల సాయం



సాయం పొందిన పేదవిద్యార్థులతో రమణేశ్వర్-స్రవంతి, డాక్టర్ చక్రధారి

నిర్మల్‌ఖిల్లా: చిన్ననాడే అకాల మరణం చెందిన తమ కూతురు ఆరాధ్య జయంతి సందర్భంగా జిల్లాకేంద్రానికి చెందిన వైద్యుడు కుంట రమణేశ్వర్-స్రవంతి దంపతులు ఏటా పేదలకు ఆర్థికసాయం అందించి అండగా నిలుస్తున్నారు. బుధవారం పట్టణంలోని కావేరి కుటీరంలో కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆరాధ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సివిల్స్‌కు శిక్షణ తీసుకుంటున్న బుద్ధ భూషణ్‌కు రూ.70వేలు, ఐదో తరగతి విద్యార్థి కార్తీక్‌కు రూ.54వేలు, మహతి అనాథ ఆశ్రమానికి రూ.20వేలు, అజయ్‌కుమార్‌కు రూ.20వేలు, మణికంఠ, మణిదీప్తిలకు రూ.10వేలు, రిత్వికకు రూ.15వేలు, అఖిల్‌కు రూ.5వేలు, నగదును అందజేశారు. అనంతపేట గ్రామానికి చెందిన దివ్యాంగులైన సున్నం సాయికుమార్, చట్ల లక్ష్మణ్‌కు వీల్‌చైర్లు అందించారు. ఐఐఎం లక్నోలో సీటు పొందిన హేమంత్ గ్రీష్మ, గ్రూప్–2 ర్యాంకర్ రూపేందర్‌కు ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు అందజేశారు. కావేరి ఫౌండేషన్ చైర్మన్, వైద్యులు అప్పాల చక్రధారి, కవి దేవరావు, కుంట భూమన్న, అప్పాల మహేశ్, నేరెళ్ల హనుమంతు, డాక్టర్ రామకృష్ణ, మైస అరవింద్, కూన రవి, విజయ్, భీమేశ్, దీపక్ పాల్గొన్నారు.

ధర్మాజీపేట్‌లో కుల బహిష్కరణ

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో కుల బహిష్కరణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మాజీపేట్‌కు చెందిన గాండ్ల గంగామణి-శంకర్ దంపతుల కూతురు ప్రియాంకను అదే గ్రామానికి చెందిన బెల్లాల నర్సయ్యతో వివాహం జరిపించారు. ప్రియాంక-నర్సయ్య కుటుంబంలో గొడవలు జరగడంతో ఇటీవల కులపెద్దలను ఆశ్రయించగా వారు పంచాయితీ నిర్వహించారు. తాము చెప్పినట్లు వినలేదని కులపెద్దలు ప్రియాంక తల్లిదండ్రులను కులసంఘం నుంచి బహిష్కరించారు. తమను కలిసే కులస్తులకు రూ.వెయ్యి జరిమానా విధిస్తామని చెప్పి మనోవేదనకు గురిచేస్తున్నారని బాధిత కుటుంబం ఈనెల1న కడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులను సంప్రదించగా వారు స్పందించలేదు. ఈవిషయమై ఖానాపూర్‌లోని సీఐ కార్యాలయంలో బుధవారం కులపెద్దలను విచారించినట్లు సమాచారం.

'మహేశ్వర్ రెడ్డిని విమర్శించే స్థాయి లేదు'

నిర్మల్‌టౌన్: 50 వేలకు పైగా మెజారిటీతో గెలిచిన నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని బీజేపీ సీనియర్ నాయకులు రాంనాథ్ హెచ్చరించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయనను విమర్శిస్తే ఊరుకునేది లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమణారెడ్డి, మెడిసేమ్మ రాజు, ఒడిసెల అర్జున్, ఆకుల కార్తీక్, సుంకరి సాయి, పద్మాకర్, గిల్లి విజయ్, నరేశ్, గంజి రాజు, లింగయ్య తదితరులు ఉన్నారు.

'9న సమ్మెను జయప్రదం చేయాలి'

బాసర: కేంద్ర ప్రభుత్వం అవలంబించే కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ లేబర్ కోడ్ల రద్దును కోరుతూ జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ట్రిపుల్ ఐటీ హౌస్ కీపింగ్ యూనియన్ అధ్యక్షుడు పిరాజీ అన్నారు. బుధవారం ట్రిపుల్ ఐటీ వీసీ కార్యాలయంలో సమ్మె నోటీసును అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు విడుదల చేసి ప్రతి నెల ఒకటో తేదీన కార్మికులకు జీతాలు చెల్లించాలని కోరారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలతోపాటు ప్లే స్లిప్పులు అందించి ఉద్యోగ భద్రత కల్పించాలని వినతిపత్రంలో కోరారు. 8 గంటల పనిని 12 గంటలకు పెంచి కార్మికుల శ్రమను దోపిడీకి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ హౌస్ కీపింగ్ యూనియన్ కార్యదర్శి సాయిలు, భారతి, లక్ష్మి, కవిత, దేవవ్వ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పేద కుటుంబానికి సాయం

ఖానాపూర్: పట్టణంలోని 11వ వార్డు పరిధి రాజీవ్‌నగర్ కాలనీలో నిరుపేదలైన కృపాకార్-ప్రేంసింగ్ దంపతుల కూతురు ఈనెల 26న నిశ్చయమైంది. బుధవారం మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం సదరు పేదకుటుంబానికి 50కిలోల బియ్యం, కొంత నగదు అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో కేఎస్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ తదితరులు ఉన్నారు.

ఎస్‌బీఐలో రక్తదాన శిబిరం

నిర్మల్‌టౌన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం నిర్మల్‌లోని బ్రాంచ్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా పలువురు రక్తదానం చేశారు. ఇందులో సామాజిక కార్యకర్త నిగులపు సంజీవ్‌కుమార్ స్వచ్ఛందంగా 45వ సారి రక్తదానం చేసి ఉదారత చాటారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రామచంద్రారావు, చీఫ్ మేనేజర్లు మనోహర్‌రెడ్డి, సూరం రాజు, నరేశ్, బ్యాంక్ అధికారులు శ్రీనివాస్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

కడెం: రైతులసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బొప్పదండి దుర్గభవాని అన్నారు. బుధవారం కడెంలోని రైతువేదికలో రైతుభరోసా సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరావు,ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఫాతిమా, పరిమళ, గంగామణి, లక్ష్మీ, సుజాత ఉన్నారు.

కాలనీల్లోని సమస్యలు పరిష్కరించాలి

భైంసాటౌన్: పట్టణంలోని పలు కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకులు కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బి. రాజేశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 12వ వార్డులో కోతులు, కుక్కల బెడదతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. డ్రెయినేజీల్లో పూడిక పేరుకుపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోందన్నారు. అలాగే దగ్గులవ్వ మందిర్ వద్ద వీధి దీపం ఏర్పాటు చేయాలని కోరారు. ఇతర సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు శేఖర్, సాయి ప్రసాద్, నవీన్, శ్రీనివాస్, యశ్వంత్, బీజేపీ నాయకులు పోశెట్టి, గాలి రాజన్న, వెంకటేశ్ తదితరులున్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శివరంజని మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు పాఠాలు బోధిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలోనే ప్రవేశాలు పొందాలని సూచించారు. అధ్యాపకులు భూషన్ పాండే, సందీప్ కులకర్ణి, బాలానంద్, సతీశ్, హరిప్రసాద్, సంతోష్, పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగింపు



మ్యాక్స్ కార్యాలయం ఎదుట పిచ్చిమొక్కలు తొలగించడంతో కన్పిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

సాక్షి స్పందన

లోకేశ్వరం: మండలకేంద్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, తీగల చుట్టూ పచ్చని తీగలు అల్లుకొని ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఈనెల 25న సాక్షిలో చుట్టుకున్న నిర్లక్ష్యం శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన విద్యుత్ ఏఈ శివకుమార్ బుధవారం సిబ్బందితో స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న పిచ్చిమొక్కలను తొలగించారు.

మోటారుకు మరమ్మతులు



మరమ్మతు చేస్తున్న పంచాయతీ కార్మికులు

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో ఓహెచ్‌ఆర్ ట్యాంకు నీరు అందించే మోటారు కాలిపోయింది. దీంతో ఐదు రోజులుగా నీటి కోసం జనం పడుతున్న ఇబ్బందులపై ఈనెల 25న సాక్షిలో నీటి కోసం జనం గోస శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్, వాటర్ గ్రిడ్ శాఖ అధికారులు మోటారుకు మరమ్మతులు చేపట్టారు. దీంతో గురువారం నుంచి ఓహెచ్‌ఆర్ ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేయనున్నారు.

తీరిన నీటి సమస్య



ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేస్తున్న పంచాయతీ సిబ్బంది

బాసర: బోరుమోటారు కాలిపోవడంతో మండలకేంద్రంలోని బోయకాలనీలో నీటి సమస్య నెలకొంది. దీనిపై ఈనెల 25న సాక్షిలో నీటి కోసం జనం గోస శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై బాసర గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీఓ గంగాసింగ్ స్పందించారు. బుధవారం సిబ్బందితో ట్యాంకర్ల ద్వారా నీటిని కాలనీకి అందించి మోటారుకు మరమ్మతులు నిర్వహించారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్(జి): రైతులు పండ్లు, పూలతోటలు, కూరగాయల సాగుకు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ డివిజన్ ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి మౌనిక తెలిపారు. మండలంలోని రాంపూర్ పంచాయతీ పరిధి చర్లపల్లి గ్రామంలో బుధవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మామిడి, బత్తాయి, నిమ్మ, సీతాఫలం పండ్ల తోటల పెంపకానికి 40 శాతం రాయితీ, అరటి, బొప్పాయి సాగుకు 50 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. మల్చింగ్ విధానంలో పూలతోటల సాగుకు 50 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. బిందు సేద్యానికి ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ, ఓసీ, చిన్న సన్నకారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. తీగ జాతి కూరగాయలు సాగు కోసం పందిరి నిర్మాణానికి ఎకరాకు రూ.లక్ష సబ్సిడీ ఉంటుందని తెలిపారు. ఏఈఓ భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వనమహోత్సవం



పార్‌పెల్లిలో మొక్క నాటుతున్న విద్యార్థులు



సారంగపూర్ : మొక్కలు నాటుతున్న విద్యార్థులు

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాచాపూర్, పొట్టపెల్లి(కే) గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో, మల్లాపూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం వన మహోత్సవం నిర్వహించారు. ఆయా పాఠశాలల ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటారు. హెచ్‌ఎంలు మోహన్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు నారాయణ, గంగ సురేశ్, పోశెట్టి, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: వనమహోత్సవంలో భాగంగా మండలంలోని జామ్ గ్రామ సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకులంలో ప్రిన్సిపాల్ సంగీత ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అమ్మ పేరిట మొక్క నాటి ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. సిబ్బంది, తదితరులు ఉన్నారు.

తానూరు: మండలంలోని దాగాం, సింగన్‌గాం గ్రామాల పాఠశాలల్లో బుధవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగ ఎంఈవో నరేందర్ పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దస్తురాబాద్: విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంఈవో గంగాధర్ అన్నారు. బుధవారం దస్తురాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నాటే మొక్కల సంరక్షణ బాధ్యతలను వారికే అప్పగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు సురేంద్రబాబు, శ్రీనివాస్, దేవ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లోనే ఏర్పాటు చేయాలి

ఖానాపూర్:యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఖానాపూర్‌లోనే ఏర్పాటు చేయాలని ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన సమితి కన్వీనర్ నంది రామయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో అఖిలపక్ష నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గతంలో బస్‌డిపో ఐటీఐ కళాశాల, ఆర్డీవో కార్యాలయం ఉట్నూర్‌కు తరలించి ఖానాపూర్‌కు అన్యాయం చేశారన్నారు. అనంతరం రిలే నిరాహార దీక్ష అనుమతి కోసం పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ నాయకులు విన్నవించా రు. ఆకుల శ్రీనివాస్, లక్ష్మన్‌రావు, గంగారావు, నారాయణరావు, రాజు, ప్రణయ్, ఉపేందర్, పీటర్, సుమిత్, రమేశ్, బుచ్చన్న, శ్రావణ్, తదితరులు ఉన్నారు.

స్టేడియమిలా.. ఆడేదెలా?





జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం అస్తవ్యస్తంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేక రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నిలుస్తోంది. స్టేడియం మెట్లపై పాన్ మరకలు, వరండాలో తాగి పడేసిన సిగరెట్లు, మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. బుధవారం క్రీడా పాఠశాలలో ప్రవేశం కోసం విద్యార్థులకు వర్షానికి ఏర్పడిన బురదలోనే ఎంపిక పోటీలు నిర్వహించారు. అధికారులు స్పందించి స్టేడియాన్ని శుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్